# మాటే మంత్రం!

మాట అంటే కేవలం నోటి నుంచి వెలువడే శబ్దం కాదు. అది మన భావాలను ఎదుటివాళ్లకు సంపూర్ణంగా తెలియజేయడానికి భగవంతుడిచ్చిన ఒక చక్కటి అవకాశం. మాట అంటే చల్లని, తియ్యని జీవనదీ ప్రవాహంలా ఉండాలి. అది చెవులతో గ్రోలుతున్నవాళ్లు అలౌకిక ఆనందానుభూతికి లోనవ్వాలి. పదేపదే ఆ అనుభూతికోసం తహతహలాడాలి. చిన్నప్పుడు తల్లిమాటే బిడ్డకు సాంత్వన చేకూరుస్తుంది. పాలకన్నా ముందు అమ్మమాటే ఆకలి తీరుస్తుంది. ఆ మాటే పసితనానికి తనకో తోడు ఉందన్న మనోధైర్యాన్నిస్తుంది. మానసిక వికాసం కలిగిస్తుంది.

మనలోని ఇతర గుణాలకన్నా ఒకరిని రంజింపజేసే గుణం మన మాటలకే ఉంది. శ్రీరాముడి మృదుభాషిత్వం గురించి చెబుతూ వాల్మీకి మహాముని ఇలా అంటాడు. ఎల్లప్పుడూ ప్రశాంత చిత్తం కలిగి ఉంటాడు. తానే చొరవ తీసుకుని ఎదుటివాళ్లతో మాట్లాడతాడు. మాటల్లో ప్రతీకారం ప్రదర్శించడు. అసత్యం పలకడు. ఒకరితో ఒకటి, మరొకరితో ఇంకోటి మాట్లాడడు- అదీ శ్రీరాముడి గొప్పదనం.

శ్రీరామచంద్రుడు అయోధ్యపురవాసులతో మృదుమధురంగా ముచ్చటించబట్టే వారంతా రామరాజ్యానికి తమ హృదయంలో పట్టం కట్టారు. ఆయన బాధను పౌరులందరూ తమ బాధగా భావించారు. అరణ్యవాసానికై కారడవికి తరలిపోతున్నప్పుడు తల్లడిల్లిపోయారు. సదా ఆగ్రహంతో ఊగిసలాడే విశ్వామిత్రుడు కూడా శ్రీరాముడి మాటల చల్లదనంలో సేదతీరాడు. తన అస్త్రశస్త్రాలూ రాముడికి ధారాదత్తం చేయడమే కాక సీతాదేవిలాంటి చల్లని తల్లితో పెళ్ళి జరిపించాడు. ఇదంతా మాటల ముత్యాలసరాల వల్ల జరిగిన మంచి.

ఒక సాధారణ పౌరుడు అసంకల్పితంగా అన్న మాట రాముడు సీతమ్మ తల్లిని పరిత్యజించడానికి కారణమై అందర్నీ బాధాతప్త హృదయంతో కంటతడి పెట్టేలా చేస్తుంది. మాట విషాద పార్శ్వం ఇది.

భారతంలో శ్రీకృష్ణుడు పాండవుల పక్షం వహించడానికి, కౌరవులను దూరంగా ఉంచడానికి కారణం- మాటే! దుర్యోధనుడు శకుని పన్నాగపు మాటల్ని ఒంట పట్టించుకుని గర్వాతిశయంతో ఎదుటివాళ్లను గాయపరచడానికి మాటల్ని శరాలుగా చేసి సంధిస్తే, ధర్మరాజు ప్రసన్న సంభాషణలతో ఎదుటివారి మనసు గెలుచుకునేవాడు. శ్రీకృష్ణుడి మనసులో స్థానంలో సంపాదించి, తమ మార్గదర్శకుణ్ని చేసుకుని అంతిమ విజయాన్ని కైవసం చేసుకున్నాడు. ఒక్క ధర్మరాజనేమిటి? పాండవులందరూ తమ సుమధుర సుకుమారమైన మాటలతో ఆద్యంతం రక్తికట్టించి అందరి మన్ననలందుకున్నారు.

అందుకే రామాయణ మహాభారతాలు మనకు నిత్యపఠనీయాలు అయ్యాయి. ఆదర్శ గ్రంథాలయ్యాయి. వ్యక్తిత్వ వికాసంలో మొదటి ప్రాధాన్యం మాటకే! కమ్మగా మాట్లాడటాన్ని సంభాషణాచాతుర్యం అంటారు. కార్య సాఫల్యతకు మంచి మాటే కారణం. మాటతో ఏదన్నా సాధించవచ్చు. వ్యక్తిత్వానికి మాటనేది పూవుకు తావిలాంటిదే.



అంతర్యామి

'ఎల్లప్పుడూ సత్యమే పలకాలి' అని వేదవాక్యం. సత్యాన్ని ప్రియంగా పలకాలి. అలా మాట్లాడటానికి చాలా సాధన, నైపుణ్యం అవసరం.

మాటే ఎదుటి వ్యక్తుల్ని మిత్రులుగాను శత్రువులుగాను మారుస్తుంది. నిరంతరం గెలుపుబాటలో పయనించాలంటే సాటివారి సహాయ సహకారాలు ఎంతో ముఖ్యం. దానికి మాటే వంతెన అన్నది మరవకూడదు.

పెదవి దాటితే పృథ్వి దాటుతుందని తెలిసిందే! మాటలు నోటినుంచి వెలువడేప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పూర్తి అవగాహనతో మాట్లాడాలి.

కార్యసాఫల్యతకు అసలు ఎలా మాట్లాడాలంటే- విషయం సుస్పష్టంగా డొంకతిరుగుడు లేకుండా ఉండాలి. సందర్భోచితంగా వ్యవహార దక్షతతో ఆలోచించి మాట్లాడాలి. ఎదుటివారి స్థాయికి అనుగుణంగా సంభాషించాలి. పెద్దలైతే మాటల్లో గౌరవం ఉట్టిపడాలి. సమవయస్కులు, పిల్లలైతే సరదాగా, ఆహ్లాదంగా ముచ్చటించాలి. మాటల్లో ఉచ్చారణ దోషాలు ఉండకూడదు. మాట్లాడేటప్పుడు ముఖం, కళ్లు, నుదురు, కనుబొమలతో ఎటువంటి వికార చేష్టలూ ప్రదర్శించకూడదు. అనవసర విషయ ప్రసంగం లేకుండా చూసుకోవాలి. బాధలు, భయాలు ఏకరవు పెట్టకూడదు. మాటల్లో సందిగ్ధం ఉండకూదు. 'నేనే అధికుడిని... నాకే అన్నీ తెలుసు' అన్న అహంభావం వ్యక్తం చేయకూడదు. విరామం తీసుకుంటూ, పదాల్ని కూడదీసుకుంటూ మాట్లాడకూడదు. అది ఎదుటివారిలో వినాలన్న ఆసక్తిని చంపేస్తుంది. కేవలం పెదాలపై నుంచి కాకుండా మాటలు స్వేచ్ఛగా మనసు లోపలినుంచి నిర్మలమైన ఊటలా ఉబికి రావాలి. ఆద్యంతం మధ్యమ స్వరంతో వినసొంపుగా మాట్లాడాలి. ఈ లక్షణాలతో మాట్లాడగలిగితే, మాట ఎదుటివారి మనసులను కట్టిపడేసే మంత్రమే అవుతుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు